# రక్తయజ్ఞం

## శ్రీ కలువకొలను సదానంద

(గత సంచిక తరువాయి)

సుందరం చాలా చింతించాడు. అతని తత్వానికి పూర్తిగా విరుద్ధమైన సంఘటన జరిగింది ఈరోజు

తిట్టుకోవడం, దెబ్బలాడుకోవడం, పగపెంచుకోవడం, ప్రతీకారం అన్వేషించడం—యివన్నీ అశాంతికరమైన స్వభావాలు.

సుందరానిది చాలా మృదుస్వభావం. అతడు కఠినం మాటలాడినా మెత్తగానే ఉంటుంది.

సాటి ప్రాణిని శారీరకంగాను, మానసికంగాను నొప్పించడం కుసంస్కారుల లక్షణం అని అతని అభిప్రాయం

బడిలో పిల్లల్ని గట్టిగా కొట్టాలన్నా అతనికి మనస్సురాదు ఎవరిని గురించిచైనా ప్రత్యక్షంలోగానీ, పరోక్షంలోగానీ మాట్లాడవలసి వచ్చినప్పుడు-తన మాటల ప్రభావం ఎవరికైనా హానినిగానీ, హీనతనుగానీ ఆపాదిస్తుందా అని ఆలోచించి మరీ జాగ్రత్తగా మాట్లాడతాడు. ఎవరైనా తనను న్యూనత పరచి మాట్లాడితే, ఆరోజు బాధపడి, ఆ మరునాడు మరిచిపోతాడు. తనను కించపరచిన వారికి కీడునుమాత్రం కాంక్షించడు.

నడుస్తూ నడుస్తూ-పాదం మోపేచోట చీమ కనిపిస్తే చాలు, అవతలికి గెంతేస్తాడు.

ఒకరోజు వాన వెలిసిన తర్వాత అతడు షికారుకు వెళ్ళి తిరిగి వస్తూంటే మసకచీకట్లో ఒక చిన్నకప్ప గెంతుతూవచ్చి అతని కాలి క్రింద చిక్కుకోబోయింది; అది ఎక్కడ నలిగిపోతుందో అని సుందరం గబగబా గెంతాడు, కానీ ఆ కప్పకూడా అతని కాళ్ళకు అడ్డంగానే గెంతింది. సుందరం దాన్ని కాపాడలేకపోయాడు. అది నలిగిపోయింది. ఆ రోజల్లా అతని మనస్సు బాధపడింది. నరకం వుందనీ, అక్కడ తనను శిక్షిస్తారనీకాదు అతని బాధ. 'అయ్యో, కప్ప నలిగి చచ్చిపోయింది పాపం! అది ఎంత బాధను అనుభవించిందో! అది చావకుండా వుంటే ఇంకా ఎన్నిరోజులు బతికి వుండేదో? ఎక్కడెక్కడ గెంతి వుండేదో? మరెన్నిసార్లు ఇలాంటి చల్లని వానలో విహరించి వుండేదో?' అనుకుని బాధపడ్డాడు.

ఏడేళ్ళ కుర్రవాడుగా వుండగా అతడు చేసిన ఒకపని లీలగా జ్ఞాపకం వుందతనికి. అతని తండ్రి ఒక అరకోడిని కొనుక్కొచ్చాడు. దాని కాలికి తాడు కట్టి, 'ఎల్లుండి పండక్కి దీన్ని కోసుకుందామే రాజీ!' అన్నాడు. దాన్ని చంపేస్తారని సుందరం మనసు ఆరాటపడింది. కత్తి తీసుకుని దానిగొంతు పరపరా కోసేస్తారు. అది గిలగిలా తన్నుకుని చస్తుంది నెత్తురు కారిపోయేలా దానిగొంతు కోసేస్తూ వుంటే దానికి బాధగా ఉండదూ?...ఎవడైనా ఓ రాక్షసుడు తనను యిలాగే పట్టుకుపోయి గొంతుకోసేస్తే?...అబ్బ!... ఈ కోడి బతికిపోతే ఎంతబాగుంటుంది!...సుందరం పండుగకు ముందురోజు చీకటిపడ్డ తర్వాత ఆ కోడిని దారంవిప్పి వదిలేశాడు. మరునాడు అతని తండ్రి వెతుక్కుంటూ వుంటే, 'నేనే వొదిలేశాను నాన్నా' అన్నాడు. 'వెధవా! పెధవా! పెద్దవాడయ్యాక ఎలా బతుక్కుంటావురా నువ్వు?' అన్నాడు అతను.

ఆ కోడి బ్రతికి బయటపడిందా? లేదు. నాలుగిళ్ళ కవతల పాకలో వుంటున్న సాయిబులు దాన్ని పట్టుకుని పీకకోసి పండుగ చేసుకున్నారు.

మాంసం తినడం కూడా బాల్యంలోనే వదిలేశాడు సుందరం. అందాకా వేడి నెత్తురు ప్రవహిస్తూ వుండి, చల్లబడిపోయిన

వింకటి కంగాలు! ఆ క్షణానికకూ జీవంతో స్పందిస్తూ వుండి, చైతన్యాన్ని కోల్పోయిన చలని కండలు! ఎలా తినడం వాటిని? అలా తినే అధికారం, హక్కు ఒక్క మనిషికితప్ప, ఏ యితర ప్రాణికీ లేదు అనిపించిం దతనికి.

అలాంటి సుందరం - చేతని మనస్సున్న సుందరం—సుకుమారుడైన సుందరం—గుండెనిండా జీవకారుణ్యం నిండిన సుందరం—పోటాట అంటే గిట్టని సుందరం—ఓ గయ్యాళి పిల్లతో పోట్లాట పెట్టుకున్నాడు. ఆమెచేత నీచమైన మాటలు అనిపించుకున్నాడు. చాలా అల్పమైనస్థాయికి దిగజారిపోయినట్టగా సిగ్గు వేసిందతనికి.

అతడు రోజూలాగా వాహ్యాళికి వెళ్ళలేదు. తిన్నగా లైబ్రరీ వైపు నడిచాడు.

లైబ్రరీలో పిల్లలు, పెదలూ కూర్చుని ఎవరికి దొరికిన పత్రిక వారు చదువుకుంటున్నారు. సుందరం బల్లముందు కుర్చీలో కూర్చుని, బాగా నలిగిపోయి పడివున్న వారపత్రికను చేతికి తీసుకున్నాడు. పరధ్యానంగా పేజీలు త్రిప్పడం మొదలు పెట్టాడు. మనస్సు మళ్ళీ సాయంకాలం జరిగిన సంఘటనమీదికి వెళ్ళింది.

ఆ గయ్యాళి పిల్లపేరు గౌరి! ఔను తనకు జ్ఞాపకమే!... ఈ ఐదారేళ్ళలో ఆ పేరు తాను మరిచిపోయాడు. ఆ ముఖాన్నికూడా మళ్ళీ తానెప్పుడూ చూచినట్టు గుర్తులేదు. ఒకవేళ చూచినా, పరీక్షగా గమనించకపోయి వుండవచ్చు.

గౌరి అప్పుడెంత చిన్నపిల! ఇప్పుడెంత పెదదయిపోయింది! ఆ శరీరాన్ని, ఆ నోటినీ, ఆ శిఖండి తనాన్నీ చూస్తే ఆశ్చర్యం వేస్తూ వుంది.

గౌరి కత్తుల వీధికి చెందిన పిల్ల. ఊరికి చివరి అంచున వుంది కత్తులవీధి. ఆ వీధిలో వున్నవాళ్ళంతా ఒక్క కులం వాళ్ళే! ... ఆ వీధి కుర్రాళ్ళ ఐకమత్యం తలుచుకుంటే సుందరానికి అసహ్యం వేస్తుంది. వాళ్ళు ఎక్కడికి వెళ్ళినా జట్టుగా వెళ్ళే వాళ్ళు. ఆకతాయి పనులు చేసేవాళ్ళు. ఇతర వీధుల పిల్లల్ని హేళన చేసేవారు. లేనిపోని కారణాలు కల్పించుకుని కయ్యానికి కాలు దువ్వే వాళ్ళు. ఒంటరిగా ఎవడైనా పొరుగు వీధుల కుర్రాడు కనిపిస్తే, వాణ్ణి కవ్వించి ఏడిపించేవారు. వాళ్ళు అన్యాయంగా ప్రవర్తించినా, వాళ్ళ మాటల్లో అది న్యాయమే! వాళ్ళ దేన్ని అన్యాయం అంటారో అదే అన్యాయం. ఒకడివల్ల తనకు అన్యాయం జరిగిందనుకుంటే—ఇరవైమంది కలిసి వాడిమీదకి దండెత్తే వాళ్ళు. పిల్లల కయ్యాల్లో పెదవాళ్ళు, ఆడవాళ్ళు ముందుకు వచ్చేవాళ్ళు. వాళ్ళ ఉనికిని, ఆధిక్యతను ఆవిధంగా మొదటినుంచీ కాపాడుకుంటున్నారు.

ఆ వీధి మధ్యలో నాగరాజు డాబాయిల్లు వుంది.

నాగరాజు—గౌరి తండ్రి.

ఆ వీధి చివర—మెయిన్ రోడు ప్రక్కన ఓ హోటలు నడుపుతున్నాడు నాగరాజు.

దేశం బ్రిటీషువాళ్ళ హయాంలో వున్నప్పుడు అతడు కొంత కాలం సైన్యంలో పనిచేశాడు. ఆ నౌకరీలోనుండి తిరిగివచ్చి, కత్తుల వీధిలో డాబా కట్టుకున్నాడు. ప్రక్కనే మెయిన్ రోడ్డులో మిలటరీ హోటలు ప్రారంభించాడు. సైన్యంలో వుండగా అతడు ఏలాగో చాలాడబ్బు సంపాదించాడని అంటారు.

సుందరానికి ఓ పెద్ద రుబ్బురోలు జ్ఞాపకం వచ్చింది. అది నాగరాజు యింట్లో వుండేది. గౌరి శరీరంలాగా ఎత్తుగా, విశాలంగా వుండేది. అతనికి పెద్ద పెద యిడ్డీలు కూడా జ్ఞాపకం వచ్చాయి. రెండుతింటే చాలు ఊపిరాడేదికాదు. ఆ పచ్చడి చాలా రుచిగా వుండేది.

రాజమ్మ రోజూ అతని యింటో పిండి రుబ్బుతుండేది. సుందరానికి ఎప్పుడైనా డబ్బు కావలసి వచ్చినప్పుడు, ఆలస్యాన్ని భరించలేక అక్కడికివెళ్ళి తల్లిని తొందర చేసేవాడు. నడవలో ఆ పెద్ద రుబ్బురోలు ముందర స్టూలు మీద కూర్చుని చేతులు మార్చుకుంటూ పిండి రుబ్బుతుండేది ఆమె. అమ్మ తనను త్వరగా పంపించ నంటోందే అనుకుంటూ సుందరం అసహనంగా చూస్తూ అక్కడ నిలుచునేవాడు.

నాగరాజు భార్య ఎత్తుగా, లావుగా వుంటుంది. అతనికో ఉంపుడుగత్తె కూడా వుంది. ఆమెకూడా స్థూలకాయురాలే! ఆమెకు పిల్లలులేరు. అతని ఆలుబిడ్డలతోబాటు ఆ యింట్లోనే వుంటూ వారితో సహజీవనం నెరపుతున్నది.

నాగరాజుకు ముగ్గురు పిల్లలు.

పెద పిల్ల పేరు రంగినాయకి.

వాసు రెండోవాడు.

అందరికంటే చిన్నపిల్ల గౌరి!

ఆడపిల్ల లిద్దరూ తల్లి పోలిక. వాసు తండ్రి పోలిక!

రంగనాయకి సుందరంకంటె చాలా పెద్దది. సుందరం చదువుకుంటూ వున్న రోజుల్లోనే ఆమె ఓ యువకుణ్ణి మెచ్చి, ప్రేమించి పెళ్ళిచేసుకుంది.

వాసు సుందరంకంటే రెండేళ్ళు చిన్నవాడు. గౌరి మరీ చిన్నది.

వాళ్ళ చదువు సంధ్యల పట్ల నాగరాజుకుగానీ, అతని కుటుంబంలోని వారికిగానీ శ్రద్ధాసక్తులు వుండేవికావు. అసలు ఆ పిల్లలకు కూడా చదువుమీద మనసుండేది కాదు. అందరూ ఏదో తరగతి వరకూ చదువుకుని, అంతే చాలనుకుని మానేశారు.

వాసు ఎప్పుడూ హోటల్‌లోనే వుంటూ వుండేవాడు.

గౌరి మాత్రం ఇంటికీ, హోటల్‌కూ తిరుగుతుండేది. రుబ్బిన పిండీ అవీ తీసుకుని హోటలుకు వెళ్ళేది. పకోడీలు, కారాలు ఒళ్ళో పోసుకుని ఎప్పుడూ నములుతూ వుండేది.

ఆమె కిప్పుడు పన్నెండేళ్ళు.

పరికిణీ జాకెటు వేసుకుని తిరిగేది. అప్పటికే ఆమె వక్షోజాలు జాకెట్టును కొద్దిగా నెట్టుకుంటూ, చూపులకు వికారాన్ని కలిగించేవి. ఆడుతూ పాడుతూ ఇల్లంతా గెంతేది ఆమె. మగ పిల్లలతో కలిసి ఆటలాడేది. వాళ్ళతో కయ్యాలాడుతూ వచ్చి బూతులు తిటేది. మగ పిల్లలుకూడా చెయ్యలేని సాహసాలు చేసేది. చేదబావి గోడమీద నిలబడి నడిచేది. చెట్టు మీదికెక్కి, చిటారుకొమ్మమీద కూర్చునేది. పరికిణీ గోచీలా పెట్టుకుని అవలీలగా కంచెలు దాటేసేది. మైలు దూరంలో చిట్టడివి వుంది. అక్కడ రేగు చెట్లున్నాయి. 'అడివికెళ్ళి రేగుపళ్ళు కోసుకుందాం రండిరా!' అని మగపిల్లల్ని పిలిచేది. ఓరోజు ఆమె ఓ మగపిల్లాడి జుట్టు పట్టుకుని దెబ్బలాడుతూ, వాడితో నేలమీద దొర్లుతూ వుండడం చూశాడు సుందరం.

అతడు వాళ్ళింటికి వెళ్ళగానే 'రావమ్మా! నీ కొడుకొచ్చాడు.' అనేది గౌరి. ఎప్పుడైనా వాళ్ళతల్లి ఇడ్లీలు, గారెలూ పెట్టేవాళ్ళు. సుందరం సిగ్గు పడుతూ తినేవాడు.

ఓసారి సుందరం వాళ్ళ యింటిలోపలికి వెళ్ళబోతుంటే— లోపలినుంచి బయటకు పరుగెత్తుకు వస్తూన్న గౌరి అతన్ని ఢీకొన్నది. ఆమె చిన్ని రొమ్ములు అతనికి మెత్తగా తగిలాయి.

గౌరి కోపంతో 'ఛీపో!' అంది.

సుందరానికి అభిమానం వచ్చి, ఆరోజునుంచి వాళ్ళ యింటికి వెళ్ళడం మానుకున్నాడు.

నాగరాజు బాగా సంపాదించేవాడు. అంత పెద్ద సంసారాన్నీ పోషించేవాడు. విచిత్రమేమంటే— తన పెళ్ళాంలాగా, ప్రియురాలిలాగా లావుగా కాకుండా అతను సన్నగా వుంటాడు. అంత సన్నటి ఒంటి మీద కండలు మాత్రం బిరుసెక్కి గుండ్రంగా వుంటాయి. అతని ముఖంలో భయంకరంగా కనిపించేవి- పెద్ద పెద్ద కళ్ళు, మెలితిరిగిన మీసాలు. ఆ మీసాలను అతడెప్పుడూ మెలిపెట్టుకుంటూ వుంటాడు.

తొలి రోజుల్లో ఆ హోటలు ఓ పూరి పాకలో వుండేది. కాయకష్టం మీద బతికే జనం చాలామంది అక్కడికి వచ్చి తింటూ వుండేవాళ్ళు. లోపల పొగ సుళ్ళు తిరుగుతూ వుండేది. బెంచీలు, బల్లలు మురికి చేరుకుని నల్లగా, అసహ్యంగా వుండేవి. అయితే— రద్దీ మాత్రం ఎప్పుడూ వుంటూ వుండేది. అక్కడ లభించే ఆహార పదార్థాలు రుచిలోను, పరిమాణంలోను ఆకర్షణీయంగా వుండేవి.

ఇప్పుడా పూరిపాకే డాబా అయింది.

నాగరాజుకు ఓ తుపాకీ వుంది. అప్పుడప్పుడూ ఆ తుపాకీ బురను తుడుచుకుంటూ హోటలు ఎదుట కూర్చునేవాడతను. సీసం కరిగించి రవ్వలు తయారుచేసుకునేవాడు. రెండు రోజులకోసారి వెళ్ళి తట్టెడు పిట్టల్ని కొట్టుకొచ్చేవాడు. ఊరిచుట్టూ వున్న పిట్టల ప్రాణాలు తీయటంకోసం యమధర్మరాజు నియమించిన కింకరుడిలా తుపాకీ భుజాన వేసుకుని తిరిగేవాడు. అప్పుడప్పుడూ పెద్ద పెద్ద తూటాలు తయారు చేసుకుని పొడుగాటి టార్చిలైటు తీసుకుని కుందేళ్ళకోసం రాత్రుల్లో బయలుదేరి వెళ్ళేవాడు. సహస్రాధిక పక్షి వినాశకుడై, పిట్టల నాగరాజు అని బిరుదు తెచ్చుకున్నాడతను.

తన సాహసాన్ని కేవలం పిట్టలపైనే కాకుండా తరుచుగా మనుషులమీద కూడా ప్రయోగించేవాడు. చాలమందిని కొట్టాడు. చాలామందిచేత తన్నులు తిన్నాడు. ఓసారి ఒకడితో తగాదా పెంచుకుని, తుపాకీ తిరగేసి వాడి నెత్తి బద్దలు కొట్టాడు. అదృష్టం కొద్దీ వాడు చావలేదు. నాగరాజు ఎవరెవరికాళ్ళో పట్టుకుని,

నాలుగైదు వందలదాకా ముడుపులు చెల్లించుకుని బతుకు జీవుడా అంటూ బయటపడ్డాడు

సుందరం గుండె ఒక్కసారి గుబగుబలాడింది. పగవాళ్ళతో చెప్పి చెప్పుతో కొట్టిస్తానంది ఆపిల్ల. వాళ్ళు మంచివాళ్ళు కాదు. ఆ పిల్లతో తానెందుకు తగాదా పెట్టుకోవాలి?...నిజంగానే వాళ్ళు కొట్టడానికి వస్తారేమో? వాళ్ళు రెచ్చిపోతే న్యాయమూ లేదు, అన్యాయమూ లేదు. ముందూ వెనకా ఆలోచించరు. తాను ఈవూళ్ళో ఎంతో పరువుగా బ్రతుకుతున్నాడు. పైగా పంతులు ఉద్యోగం చేస్తున్నాడు. వెధవది-లోకంలో ఎవ్వడికీ అక్కర్లేని పరువు ప్రతిష్ఠలు, మాన మర్యాదలు, నీతినియమాలు ఈ ముష్టి పంతులుగాడికే కావాలి! అన్నం లేకపోయినా ఫరవాలేదు. ప్రాణం పోయినా చింతలేదు. 'అయ్యో—నా పరువు!'

'నాలుక కోస్తాను' అన్నాడు తాను. ఆ ఒక్క మాటా అనకుండా వుంటే బాగుండేదేమో?

'ఇదిగో...ఎంత పిరికివాణ్ని నేను! ఇలా బెదిరిపోతున్నానేమిటీ? ఎంతో సహనాన్ని కోల్పోయిన తరవాతకదా ఆ మాటన్నాను నేను? ఆపిల్ల అత్తయ్యాను అన్నమాటలుమాత్రం బాగున్నాయా? ఇతరులంటే భయమూ భక్తీ లేకుంటే మానె! నీతీ న్యాయమైనా పాటించవద్దా? ఆ అమ్మాయి దురాగతానికి ఎవరికిమాత్రం కోపం రాదు? అప్పటికీ నేనెంతో మేలు! ఇంకెవరైనా అయితే ఆ అమ్మాయిని దవడపళ్ళు రాలగొట్టి వుందురు. కోపం రాని నావంటి వాడికే కోపం తెప్పించిందంటే-ఆపిల్లదే అన్యాయం! పన్ను కొట్టడం మహాఘోరం! అలా జరగడమే విధి నిరయమైతే—దేవుడనేవాడు కళ్ళూ చెవులూ లేని జడ్డితో సమానం!' అనుకున్నాడు సుందరం.

పరిచితమైన గొంతు విని ఉలికిపడ్డాడతను. అతని వెనుక రామలింగం నిలబడి వున్నాడు.

'పుస్తకం తలకిందులుగా పట్టుకుని చదువుతున్నావేట్రా సుందరం?'

అప్పటికి లైబ్రరీలోనుంచి అందరూ వెళ్ళిపోయారు. గోడ గడియారంలో గంట ఏడున్నరైంది. చెల్లాచెదురుగా పడివున్న పత్రికలను, పుస్తకాలను తీసి అలమారులో పెట్టేశాడు అటెండరు. కిటికీలన్నీ మూసేస్తున్నాడు. లైబ్రేరియన్ తాళంచెవుల గుత్తి చేతికి తీసుకుని గలగలలాడిస్తున్నాడు అసహనంగా.

సుందరం, రామలింగం బయటకు వచ్చారు.

సుందరం నిలబడి రామలింగం ముఖంలోకి చూశాడు.

'రామలింగం!'

'ఏం సుందరం?'

సుందరం తటపటాయించాడు.

రామలింగం అతని బాల్యమిత్రుడు. సహోద్యాయి. రైల్వేలో ఇంజన్ క్లీనర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అతని కాపురం కత్తుల వీధిలో.

సాయంత్రం జరిగిన సంఘటన గురించి అతనికి చెబుదామని నోటిదాకా వచ్చింది సుందరానికి. మళ్ళీ సందేహించాడు. అతనితో చెప్పవలసిన అవసరం ఏముంది?... రామలింగం నవ్వుతాడేమో? తనను పుత్తకొంగరు మనిషి అని అనుకుంటాడేమో!

'ఏమీ లేదులే!' అన్నాడు సుందరం.

అతనివైపు చిత్రంగా చూశాడు రామలింగం.

* * *

మెత్తని గుండెలు దడదడలాడేటట్లు 'బొయ్యి' మంటూ పంచాయతీబోర్డు సైరను చెవులు చిల్లులు పొడుస్తోంది.

గంట ఎనిమిది!

సుందరం యింటిదారి పట్టాడు.

అనంతమైన చీకట్లో వీధిదీపాలు మిణుగురుల్లా వెలుగుతున్నాయి. వీధుల్లో జనం రద్దీ పలచబడింది. బజారు వీధిలో వర్తకులందరూ కొట్లు మూసుకుంటున్నారు. గజ్జి కుక్క పడుకోటానికి చోటు వెతుక్కుంటోంది.

తనకు ఎదురుగా వచ్చే మనుషులవైపు అనుమానంగా చూస్తున్నాడు సుందరం. అప్పుడప్పుడూ వెనక్కి తిరిగి చూస్తున్నాడు. ప్రతివాడూ అతని కంటికి నాగరాజు అనుచరుడిలాగ కనిపిస్తున్నాడు

సుందరం ఆలోచనలు గౌరిచేసిన ప్రతిజ్ఞ మీదనే వున్నాయి.

'పిలిస్తే పలికే మనుషులు వాళ్ళకు ఎక్కువగా వున్నారు. పైగా, ఆ కత్తుల వీధివుందే—అది విచిత్రమైన వీధి. వాళ్ళలో వాళ్ళు తన్నుకు చస్తూవుంటారు. పొరుగు వీధి వాడితో ఎవడికైనా తగాదావస్తే మాత్రం అందరూ ఒక్కటైపోతారు...రాత్రికి నాగరాజు వస్తాడేమో!...అతని వెంట ఓ నలుగురు దయలేని మనుష్యులుంటారు. వాళ్ళకు బుద్ధి, హృదయం బొత్తిగా వుండవు. ఈ సువిశాల ప్రపంచంలో వాళ్ళకు తెలిసింది ఒకటే! ఎవడైతే తమకింత కబళం వేస్తాడో, ఎవడైతే ఓ పావలా సారా పోయిస్తాడో వాడు చెప్పిన పని గబుక్కున చేసెయ్యడం. అదొక్కటితప్ప యింకోపని చేతగాదు వాళ్ళకు!...ఇంటి ముందరికివచ్చి, కేకలేస్తాడు నాగరాజు. 'ఏమిటోయ్, నా కూతుర్ని తిట్టావట? కొవ్వు నెత్తికెక్కిందా?' అంటాడు. నేను న్యాయం చెప్పబోతాను. న్యాయం, ధర్మం వాడికి గిట్టవు. వాడు రావడమే జడ్జిమెంటుతో వస్తాడు. పిడికిలి బిగించి నన్ను-కణతమీద-ఒక్క దెబ్బ కొడతాడు. తుపాకి పిడిలాగా గట్టిగా వుంటుందేమో—పిడికిలి! ఆ దెబ్బ తీసుకుని నే మారుకుంటానా? నేనూ యువకుణ్నే కదా? ముసలివాడివేత దెబ్బతిని, చచ్చిన పీనుగులా పూరుకుంటే—నా ఉడుకు నెత్తురు బూడిదలో పారబోయటానికా? ...అప్పుడు నేనతన్ని కొడతానా? కొట్టకపోయినా, తిడతానేమో!... అతని బంటుకు అది చక్కని అవకాశం. వెంటనే నలుగురూ నాలుగు దెబ్బలు వేస్తారు. నేను వాళ్ళతో పెనుగులాడాలి. నన్ను చితగ్గొట్టి, వాళ్ళు విజయగర్వంతో కేకలు పెడుతూ వెళ్ళిపోతారు. వీధిలోనివాళ్ళందరూ మూగి చూస్తారు. తెల్లవారాక బడిలో పిల్లలందరికీ తెలిసిపోతుంది. నేను తప్పు చేశాననీ, నాగరాజు శిక్షించాడనీ అందరూ అనుకుంటారు. నా పరువు మట్టిలో కలిసిపోతుంది. ఛీఛీ! ఈ మానవ జీవితం వెధవది! మనిషిగా పుట్టడం కంటే అడవిలో జంతువుగా పుట్టడం మంచిది!...అడవిలో పులులూ, తోడేళ్ళూ వుండవా? ఈ మనుష్యుల్లాగానే అవికూడా హింసించవా? ఏమైనా అదికాస్త నయం! అవి కండలే కదా తింటాయి? నెత్తురేకదా తాగుతాయి?...పరువు పోతుందనే భయం అక్కడలేదు. ఇప్పుడేం చేయాలి నేను? ఈ విపత్తు గడవడం ఎలా...'

సుందరం అడుగులు భారంగా పడుతున్నాయి.

'ఈ పాటికే వాళ్ళెవరన్నా ఇంటికి వచ్చివుంటారా?... అలా వచ్చివుంటేనే బాగుంటుంది. ఇంట్లో నేను కనబడకపోయేసరికి, వాళ్ళకు నిరుత్సాహమైపోతుంది. వాళ్ళ వేడి చల్లారిపోతుంది. ఇంట్లో అమ్మ, అత్తయ్య వున్నారుకదా, వాళ్ళేదైనా సర్ది పంపేస్తారు. అది నాకూ గౌరవంగా వుంటుంది. నేను యింట్లో లేని సమయంలో వాళ్ళు వచ్చి వెళ్ళారు గనుక—వాళ్ళతో దెబ్బలాడే అవసరముండదు గనుక—గెలుపు ఎవరిదో, ఓటమి ఎవరిదో తేలదు. వాళ్ళదే పైచెయ్యిఅని వాళ్ళనుకోవచ్చు, నేనే మొనగాణ్ణి అని నేననుకోవచ్చు.'

సుందరం తన వీధిలోకి వచ్చాడు. తన గుండెచప్పుడు స్పష్టంగా వినిపిస్తోందతనికి. ఇంటిని సమీపించాడు. ఇంటి బయట అలికిడేలేదు లోపల ఏదైనా సందడి వినిపిస్తుందేమోనని చెవులు రిక్కించాడు నిశ్శబ్దంగా వుంది.

'ఇంకా వాళ్ళెవరూ వచ్చినట్టులేదు. అసలు ఎవ్వరూ రారేమో! ఆ పిల్ల హడలగొట్టడానికి అలా అన్నదేమో!

'ఏమో! రారు అని గ్యారంటీ ఏముంది?.. ఇక ముందు వస్తారేమో!'

లోపలికి వెళ్ళాడు సుందరం.

'ఆడపిల్లకాదది. ఆడపులి!' అంటోంది రాజమ్మ.

'ఎందుకొచ్చానా అని వాడే సిగ్గుపడి వెళ్ళిపోయాడు, పాపం!' అంటోంది శాంతమ్మ.

సుందరం చొక్కా విప్పుతూ 'ఏమిటత్తయ్యా?' అన్నాడు ప్రశాంత గంభీరంగా.

'ఎవడో దాని అన్నట, సుందరం! వాడొచ్చిపోయాడు...'

ఓ అరగంట క్రితమే గౌరి అన్న వాసువచ్చి వాకిట్లో నిలబడ్డాడు. గుబురుగావున్న క్రాపు వాడిది. మెడలో పులిగోరు. మెడచుట్టూ రుమాలు. చేతి మణికట్టుకు జేబురుమాలు చుట్టుకున్నాడు.

శాంతమ్మ వాణ్ణి వర్ణిస్తూవుంటే సుందరానికి అసహనంగా వుంది.

...వాకిట్లో నిలబడిన వాసు రాజమ్మను చూచి ఉగ్రుడై మండిపడుతూ 'వాలికకోసే మొనగాడు—ఎవడువాడు? ఇలారమ్మను, నోటిపళ్ళు విరగొట్టి చేతికిస్తాను' అన్నాడు.

'ఎవరేమన్నారని యిక్కడికొచ్చి కేకలేస్తావు?' అంది రాజమ్మ.

'మా చెల్లి నీళ్ళకొస్తే-నీ కొడుకు ఏమేమో అన్నాడటనే? నాలికకోస్తాడటనే! ఆడపిల్లనంటే, పెద్ద మొనగాడ్లే. పోయినట్టా? ఏదీ, నా దగ్గిర నాపించమను ఆ తలబిరుసు!...లోపలున్నాడా? రమ్మనూ బయటికి!'

'మావాడు పోట్లాడే రకంకాదు నాయనా! వాడిమీదికి నువ్విలా రాకు!.. అనవలసిన మాటలన్నీ నీ చెల్లే అనేసి, వాడిమీద చాడీలు చెప్పి నిన్ను పంపించిందా? ఆడపిల్ల మాటవిని అదే నిజం అనుకోవటం మంచిదికాదు. నువ్వెళ్ళు వాసూ! వాడింట్లో లేడు...'

'ఏం జరిగిందో తెలుసుకోకుండా, అలా మాటలు పారేసుకోకు బాబూ! ఈ వీధిలో వాళ్ళందర్నీ అడుగు! ఎవరిది తప్పో, వాళ్ళే చెబుతారు. నీళ్ళు పట్టుకుంటుంటే, బలంగా పక్కకు నెట్టింది. 'ఎందుకమ్మా తొందర?' అన్నాను. అంతే! బేట్రా, గీట్రా అంది. 'చెప్పుతో కొడతాను, పొగ్గించి తంతాను, ముష్టి ముండా, అడుక్కుతినే ముండా, గుడిచేటి' అంటూ నన్ను బండబూతులు తిట్టింది. అది బాగుందా నీకు?'

'అయితే మీరూ మీరూ కదా తిట్టుకోవాలి? ఆడపిల్లను పట్టుకుని వాడెందుకంటాడు అంతమాట? నాలిక కోస్తానంటే అదేం చిన్నమాటనా?' అన్నాడు వాసు

'నాలిక కోస్తాననలేదు బాబూ! నాలిక కాస్త లోపలి పెట్టుకుని మాట్లాడు-అన్నాడు. 'తంతాను, నోరుమూసుకోరా' అంది నీ చెల్లి. వాడే భయపడి లోపలికొచ్చేశాడు. వాణ్ణి ఎన్ని మాటలంది! అది చాలక, కొట్టి రమ్మని నిన్ను పంపిందా! బాగుంది నాయనా!'

వాసు సిగ్గుపడ్డాడు. 'నేను దాన్ని మందలించుకుంటాను గానీ, మాటలు మీరు పట్టించుకోకండి. అదేమన్నా అంటే మాతో చెప్పాలిగానీ, దాన్ని తిడితేమాత్రం బాగుండదు' అంటూ అతను వెళ్ళిపోయాడు.

...జరిగిన సంగతి విని, 'అయ్యో, ఆ సమయంలో నేను లేకపోయానే' అన్నట్టు పోజుపెట్టాడు సుందరం. వాసు తనను వాడూ వీడూ అనడం, తనను కొట్టగలంతటి ధీమాను ప్రదర్శించడం అతనికేమీ వచ్చలేదు.

లోపలేమో అతనికి సంతోషమే వేసింది. మనసు కాస్త తేలికపడింది. తాను లేని సమయంలోనే ఈ గొడవకాస్తా సర్దుబాటు కావడం అతనికి యిష్టంగానే వుంది. వాసు ఎలా వుంటాడో ఈ ఐదేళ్ళ తరవాత తాను సరిగా చూడలేదు. ఇప్పుడు పెద్దవాడై వుంటాడు. మీసాలు కూడా వచ్చి వుంటాయి. దెబ్బలాడటం బాగా అలవాటై వుంటుంది తాను ఇంట్లోనే వుండి వుంటే, వాడితో పోట్లాడవలసి వచ్చేది. సర్దిచెప్పటానికైనా అవకాశమివ్వకుండా దుడుకుమాట అంటుంటే, తాను వూరుకోగలడా? మాటకు మాట అంటూ సిగపట్టు పట్టుకోవలసి వచ్చేది...ఎంత నీచమైన పని అది!

...ఎవడో ఒకడు-వచ్చాడు, వెళ్ళిపోయాడు. చాలు!

సుందరం భోజనం చేసి, సాయంత్రం వేసిన బొమ్మను చేతికి తీసుకున్నాడు. ఆ బొమ్మ నొసట తాను బొట్టు పెట్టనే లేదు. ఆ బొట్టు పెట్టనివ్వకుండా అడ్డుపడింది గౌరి. లేకుంటే చిత్రం ఎప్పుడో పూర్తయి వుండేది.

ఈసారి నాగరాజు వస్తాడేమోనన్న ఊహ కలిగిందతనికి. అలా అనుకోగానే అతని ముఖం మళ్ళీ కళావిహీనమైపోయింది. వాసు పిల్లవెధవ! వాడు రాజీపడితేమాత్రం నాగరాజు వూరుకుంటాడా? ఒకవేళ నాగరాజు లేకుండావుండి, ముందుగా పైలట్‌లా వీడు వచ్చాడేమో!...ఈ వ్యవహారాన్ని నాగరాజు యింత తేలిగ్గా పోనిస్తాడంటే తనకు నమ్మకం కుదరటంలేదు.

సుందరానికి మళ్ళీ దిగులువేసింది. వెళ్ళి పరుపుమీద పడుకున్నాడు. ఎంత ప్రయత్నించినా నిద్ర రావటంలేదు. నాగరాజు రాక కోసం ఎదురు చూస్తున్నవాడిలా పడుకున్నాడు.

'అతను వస్తే నేనెలా ప్రవర్తించాలి?...నాగరాజు నన్ను మాట్లాడనివ్వకుండా తిడతాడు కొట్టడానికి వస్తాడు. అప్పుడు నేను తిరగబడాలా? ఊహూఁ!...చాలా శాంతంగా, వినయంగా మాట్లాడుతాను. వాణ్ణి ఏమండీ అని చాలా మర్యాదగా పిలుస్తాను. 'మీరు పూర్తిగా విని, నా తప్పేమయినావుంటే మీ కాలిచెప్పుతో కొట్టండి. తింటే తప్పులేదు. మీరు పెద్దవాళ్ళు!...నా అత్తయ్య చాలా మంచిదండీ! ఆవిడ ఎవరినిగానీ పల్లెత్తుమాట అనే మనిషి కాదు. ఆమెను పట్టుకుని మీ బిడ్డ చాలా హీనమైన మాటలంది. 'నాలిక కాస్త లోపల పెట్టుకుని మాట్లాడవమ్మా' అన్నాను నేను. నువ్వు లోపలికి పోరా బేటా!' అంది. లోపలి కొచ్చేశాను. నేనేమీ అనలేదు. ఎందుకంటాను? మీ గౌరి నా చెల్లెలులాంటిది. మీరు నాకు చిన్నప్పటినుంచీ తెలుసునే!...మీపట్ల నాకెంతో భయభక్తులున్నాయి...' అని చెప్పుకు

పోతే? ఛీ! అంతకంటే సిగ్గుమాలినతనం యింకొకటిలేదు. ఏం జరిగినాసరే- నా వ్యక్తిత్వాన్ని కించపరచుకునే విధంగా నేనే ఎందుకు మాట్లాడాలి? ఎవరు తిటినా, ఎవరు కొట్టినా నేను హుందాగానే వుంటాను. న్యాయం ఓడిపోయినాసరే, ఆత్మగౌరవం అనే గోచీని మాత్రం విప్పి పారనేయను' అనుకున్నాడు సుందరం.

మనిషిలో సామాజికదృష్టి: విశ్వమానవతాభావం- గొంగళి పురుగు పట్టుకున్న ఆకుల్లాగా క్రమంగా తరిగిపోతున్నాయి. వైయక్తికమైన ఆలోచనలే బలిసిపోతున్నాయి. లోకం ఎలా పోతే తనకేం, తన దారిలో ఏ అడ్డంకులూ లేకుంటే అంతే చాలునని అవకాశాలతో రాజీపడే మనుషులే ప్రపంచమంతటా నిండిపోతున్నారు. నడివీధిలో ఒకడు మరొకడి తల నరుకుతుంటే-మనకెందుకులే అని, చూచీ చూడనట్టు తలవంచుకొని వెళ్ళిపోయేంతటి ఉదాసీనతకు అలవాటు పడిపోతున్నారు.

నాగరాజు తనమీదికి దౌర్జన్యానికివస్తే, అడ్డుపడేవాళ్ళు ఈ వీధిలో వున్నారా? ఈ వూళ్ళో వున్నారా? లేరు! లేరనుకోవడం ఎంత సిగ్గుచేటుగా వుంది! వాళ్ళుమాత్రం ఏం చేస్తారు? పాపం, మనుషులు! ఈ జీవితం స్థిరమైనట్లు, దీని ఆయుర్దాయం పదివేల సంవత్సరాలన్నట్లు, ఏమాత్రం పొరబడినా నూనెగిన్నెలాగా క్రింద జారిపడి అదంతా ఒలికిపోతుందన్నట్లు మెలకువగా వుంటారు. వారి వారి బ్రతుకులు తప్ప తక్కినవాటి వూసు వాళ్ళకెందుకు ?

నాగరాజో, అతడికి సంబంధించిన మనుషులో తనను కొడతారనుకో! ఏం చేయాలి తాను?...వున్నారుకదా రక్షక భటులు! వాళ్ళకు రిపోర్టు చేస్తే?...ఔను! అదే కర్తవ్యం! బలహీనులకు, రక్షాహీనులకు వాళ్ళేకదా దిక్కు?

'మహారాజ రాజశ్రీ దుష్టశిక్షకులూ శిష్టరక్షకులూ అయిన పోలీసు సబ్ఇన్స్పెక్టరువారి దివ్యసముఖమునకు ధర్మరాజుల గుడి వీధిలోనుండు కె. సుందరం అను పేరుగల నేను వినయ పూర్వకముగా నమస్కరించి వ్రాసుకొను అర్జీ ఏమనగా-అయ్యా... (ఆడవాళ్ళు పోలీసు సబిన్స్పెక్టర్లుగా వుంటే, అమ్మా అనాలి. మొరపెట్టుకోటానికి అయ్యా అనటంకంటే అమ్మా అనే సంబోధనే బాగుంటుంది.)...నేను చాలా మంచివాడను! (సందేహమెందుకూ?) కన్నుమిన్నుగానకపోవు లారీక్రింద కుక్కపిల్ల పడి నలిగిపోయినచో అయ్యో అనుకొందును. ఆడపిల్ల జడ పట్టుకుని లాగి పారిపోవుచున్న పిల్లవాడు రోడ్డుమీద జారిపడి, మోకాళ్ళు రాచుకొనిపోయినచో అయ్యో అనుకొందును. ఒకరిని తిట్టవలెనన్నచో గుండెలదరును. కొట్టవలెనన్నచో కాళ్ళదరును. ఇట్టి హృదయమును మానసికవేత్తలు దుర్బల హృదయమని అందురు. కాని మహాత్ములు సాధుహృదయమని అందురు. నా మంచి తనమునకును, సాధుత్వమునకును నా ఉపాధ్యాయవృత్తియే నిదర్శనము. సాధు గుణముగలవాని పాలిటికి బ్రతుకొక ఘోరాటవి! ఆ అడవిలో కోయ దొరవలె సంచరించు ఎత్తుగడ, లేదా హృదయ కాఠిన్యము అతనికి అలవడలేదు గనుక సాధు జంతువువలె మనుష్యులకు బానిసై, దారిద్ర్యమునకు సమాట్టు, అగుచున్నాడు గొడ్డుచావడివంటి బ్రతుకున కలవాటుపడి, గంజియే పాయసమనుకొని తృప్తి పడుచున్నాడు. బ్రతుకలేనివాడు బడి పంతులు అను నానుడికి అర్థమిదే!... (ఈ సోదె అంత పోలీసు వాళ్ళతో చెప్పుకోవడ మెందుకులే!)

'...ఇట్టి నన్ను కత్తుల వీధిలోనుండు శ్రీ నాగరాజు...(శ్రీ అనేది గౌరవ వాచకం. విరోధినికూడా గౌరవించే మనిషి చాలా ఉన్నతుడు)...శ్రీ నాగరాజు, అతని అనుచరులు మరికొందరు-మా యింటికి వచ్చి, నన్ను వీధిలోనికి లాగి, దుర్భాషలాడుచు, చాలా అన్యాయముగా కొట్టినారు. కుట్టుట తేలుకు స్వభావమైనట్లు, కొట్టుట వారి స్వభావము గాన కారణము అవసరములేదు. వారిని విచారించి, తగు చర్యగైకొని, నావంటివారి మాన ప్రాణములకు (ధనములేదు) రక్షణ కల్పించ వలసినదిగా ప్రార్థించుచున్నాను.'

పోలీసు అధికారితో ముఖతః మరిరెండుమాటలు కూడా విన్నవించుకోవాలి.

'ఇన్స్పెక్టరుగారూ! లోకంలో ఒకడు మరొకణ్ణి కొట్టడం, ఖూనీ చేయడం సర్వసామాన్యమే! అయితే దురదృష్టంకొద్దీ బిడ్డను తల్లిముందు, తల్లిని బిడ్డముందు, పెళ్ళాన్ని మొగుడి ముందు, మొగుణ్ణి పెళ్ళాంముందు కొట్టే అడివి మనుషులుకూడా వున్నారు. అలాంటివాళ్ళు చాలా అనాగరికులు, సంస్కారహీనులు, క్రూరులు. వాళ్ళకు హృదయం ఉండదు. ...ఈ ఒళ్ళు నాది కాదండీ. మా అమ్మది. ఈ శరీరాన్ని ఆమె పువ్వులాగా రేకు కందకుండా పెంచింది. ఇది వాడి ఎండిపోకుండా వుండాలని ఆమె తన జీవితమంతా చెమటోడ్చి కష్టపడింది. ఆమె పస్తులుండి నాకు అన్నం పెట్టింది. ఆమెరక్తమంతా నా ఒంట్లోనేవుంది. ఆమె ప్రాణానికి నేను రూపాన్ని! ఆమె శరీరానికీ నా శరీరానికీ విద్యుత్తులాంటి సంబంధంవుంది. ఇక్కడ స్విచ్ వేస్తే అక్కడ లైటు వెలుగుతుంది. ఇక్కడ హలో అంటే అక్కడ వినిపిస్తుంది. ఇక్కడ

కొడితే అక్కడ నెత్తురు కాగుతుంది. ఈ గుండె మూలిగితే ఆ గుండె కెవ్వుమంటుంది. అలాంటి మా అమ్మముందు ... ... అమ్మ ముందు...'

* * *

'ఒరే సుందరం! లే నాయనా! మీ అత్తయ్య వూరికెళ్తా అంటోంది.'

సుందరం ఉలికిపడి లేచి కూర్చున్నాడు.

బాగా తెల్లవారి పోయింది. ఎదురింటి కప్పుమీద పడుతున్న పీరెండ కళ్ళకు మిరుమిట్లు గొలిపింది.

సుందరం కళ్ళు నులుముకున్నాడు. ఏమిటీ? ఇంత ఆశ్చర్యకరంగా తెల్లవారి పోతుందని తాను అనుకోలేదే!...అయితే నాగరాజు రాలేదన్నమాట!

అతడు నవ్వుకున్నాడు: తాను లేనివి, పోనివి ఊహించుకుని దిగులుపడిపోవడం కాకపోతే—నాగరాజేమిటీ, రావడమేమిటి?

సుందరం లేచి ఒళ్ళు విరుచుకున్నాడు.

శాంతమ్మ తల దువ్వుకుంటోంది.

'రాకరాక వచ్చి అప్పుడే వెళ్తానంటావేమత్తయ్యా? రెండు రోజాలుండి వెడుదువుగానిలే!'

'వచ్చి రెండు రోజులయిందికదా సుందరం!...మీ మామయ్య కోప్పడతారు. ఒక్కరోజు నేను లేకపోతే, ఆ యిల్లు ఏరువు దిబ్బలా తయారవుతుంది.'

సుందరం స్నానంచేసి వచ్చాడు.

అతని తల్లీ, అత్తయ్యా యిద్దరూ మాట్లాడుకుంటున్నారు.

'ఆడపిల్లను కన్నవాళ్ళం కాబట్టి అలుసై పోయాం. మొదట మేమే అడుక్కోవాలనుకుంటున్నావా వదినా?' అంది శాంతమ్మ.

కాకపోతే ఆ అవకాశం పోగొట్టుకుంటావనుకున్నావా?'

శాంతమ్మ నవ్వింది.

'ఆయన కూడా—నీతో మాట్లాడి, నువ్వేమంటావో తెలుసుకుని రమ్మన్నారు, సుశీల ఏడిగి రెండేళ్ళు దాటిపోతూవుంది. నువ్వు సరేనంటే ఆ సూరుడుముట్నా వేయించి, పంపించేస్తాం.'

'ఎక్కడికి?'

'ఇంకెక్కడికి? వాళ్ళత్త దగ్గరికి!'

రాజమ్మ నవ్వుతూ కూర్చుంది.

'వాతో యిన్ని మాటలెందుకు శాంతా? వాడుకన్న, మీరు కదు! ఆ ఒక్క మాటా వాణ్నే అడుగు!'

'నువ్వే అడుగు!'

'ఏం సుందరం? వాళ్ళ పిల్లను చేసుకుంటావా?'

సుందరం గోడవైపు తిరిగి తలదువ్వుకుంటున్నాడు.

'ఏ పిల్లమ్మా? పెద పిల్లా, చిన్నపిల్లా?'

'చిన్నపిల్లకు యింకా ఈడు రాలేదురా!' అంది శాంతమ్మ, కొంటెగా.

'ఏదరైతేనేం గానీ, వస్తేను అడక్కమ్మా! నీ ఇష్టమే నా ఇష్టం! అన్నాడు సుందరం, బుద్ధిగా కాపు దువ్వుకుంటూ.

'ఇది మరీ బాగుందిరా! సుశీల మనకొద్దు అంటే నువ్వు నిజంగ ఒప్పుకుంటావా?...పిచ్చివేషాలుమాని మాటిగా చెప్పు!'

'పిస్సవడుతున్నాడు వదినా! వాళ్ళిద్దరికీ యిష్టమేలే!'

రాజమ్మ విస్మయాన్ని అభినయించింది. 'మరి యింతసేపూ చెప్పవేం? అత్తా, అల్లుడూ అప్పుడే కూడబలుక్కున్నారన్నమాట! అయితే, నన్ను బతిమాలుకోవడం దేనికీ? నటన గాకపోతే! ..వినే, వాడూ అదీ యిష్టపడ్డ తర్వాత మన యిష్టంతో పనేముంది?... మీరే వాణ్ణొక యింటివాణ్ణి చెయ్యండి!'

ఉపాహారం తిని, కాఫీ త్రాగి శాంతమ్మ, సుందరం ఇంట్లో నుంచి బయలుదేరారు.

'వెళ్ళొస్తా వదినా! అంది శాంతమ్మ.

'వెళ్ళిరా శాంతా! .. వెళ్ళగానే ఉత్తరం రాయి!'

'అలాగే!'

సుందరం, శాంతమ్మ బజారో పడుతున్నారు.

ఆమె ఓ స్వీట్స్ దుకాణంముందు ఆగింది.

'ఏమైనా కొనుక్కోవాలా అత్తయ్యా?'

'సుశీల కాటుక డబ్బీ ఒకటి కావాలంది సుందరం!'

ఇద్దరూ దుకాణంలోకి వెళ్ళారు.

శాంతమ్మ కాటుకడబ్బీ కొనుక్కుంది. అక్కడ వరుసగా వేలాడ దీసిన నవరాలవైపు చూస్తూ, ఒక నవరాన్ని చేతితో ముట్టుకుని 'దీని ధర ఎంతండీ?' అని అడిగింది.

'ఇరవై రూపాయలమ్మా!'

'ఆ నవరం కొనుక్కుంటావా అత్తయ్యా?' అని అడిగాడు సుందరం.

'ఎందుకు నాయనా? పూరికే ఆడిగాను. సుశీలకు నవరం పెట్టుకోవలసిన అవసరమే లేదు. దానివి -పొడుగాటి వెంట్రుకలు. తన జడే తనకు బరువనంటూ వుంటుంది.'

అద్దాల వెనుక ఆకర్షణీయంగా వున్న గాజులవైపు చూచిందామె.

'ఆ చమ్కీగాజులిలా తియ్యండి.' అంది.

దుకాణంవాడు అద్దాల తలుపు పక్కకునెట్టి, 'ఏవి కావాలో చూడండమ్మా!' అన్నాడు.

శాంతమ్మ సైజు వెతికి, 'వీటిని చూడు సుందరం! ...సుశీల చేతులకు ఏ గాజులైతే బాగుంటుందో చెప్పు!' అంది.

సుందరం ఆగాజులన్నీ పరీక్షించి, గులాబీరంగు గాజుల్ని చూపి, 'ఇవి తీసుకో అత్తయ్యా!' అన్నాడు.

ఆ గాజులు ఓ రెండు జతలు కొనుక్కుంది శాంతమ్మ.

ఇద్దరూ బస్‌స్టాండు చేరుకున్నారు.

ఆమె బస్సులో ఎక్కి కూర్చుంది. సుందరం కండక్టరు దగ్గరనుంచి టిక్కెట్టు కొని ఆమెకిచ్చాడు. దగ్గరగా వున్న కొట్లో ఓ డజను అరటిపళ్ళు కొనుక్కున్నాడు. ప్రక్కనే పూలదుకాణం వుంది.

'ఈ కదంబాలు సుశీలతలలో వుంటే, ఎంతో అందంగా వుంటుంది.'

అతను ఓ అర్ధరూపాయికి కదంబాలు కొన్నాడు. పళ్ళు, పువ్వులూ బస్సులో కూర్చున్న శాంతమ్మకు అందించాడు.

ఆమె ఆ పువ్వుల్ని ఓసారి వాసనచూచి 'పువ్వులు చాలా బాగున్నాయి సుందరం!' అంది. తాను కొంత తెంపి తలలో పెట్టుకుని, మిగిలిన పువ్వుల్ని సంచిలో పెట్టుకుంటూ 'సుశీలకు కదంబా లంటే ప్రాణం!' అంది.

డ్రైవరు హారను నొక్కాడు.

'ఇక నువ్వెళ్ళు సుందరం! బడికి వేళవుతుంది: నేను వెళ్ళి ఉత్తరం రాయిస్తాను. బదులు రాస్తావు కదూ? ...ఎప్పుడైనా ఓ సెలవురోజున వూరికిరారా! దగ్గరేకదా!' అంది శాంతమ్మ.

'వస్తాలే అత్తయ్యా!

బస్సు వెళ్ళిపోయింది. సుందరం బడికి బయలుదేరాడు.

అతనికి హాయిగావుంది. మనసులో తేనెలూరుతున్నాయి అత్తయ్య తనతో మాటి మాటికీ సుశీలను గురించి మాట్లాడింది. సుశీలకు కాటుక కొనుక్కోవాలంది. ఆమె వెంట్రుకలు అందంగా వుంటాయంది. ఆమె చేతులకు ఏ గాజులు బాగుంటాయో తనవే సెలెక్ట్ చెయ్యమంది. 'కదంబాలు బాగున్నాయి, సుశీలకు కదంబాలంటే ప్రాణం' అంది. సుశీలను తన మనస్సులో నిలిపివేయాలని ఆమె ప్రయత్నం. లోకంలో ఆడవాళ్ళంతా యింతేనేమో! తన మొగుడు తనకే బందీ కావాలనుకుంటారు. తన అల్లుడు తన కూతురికే బందీ కావాలనుకుంటారు.

సుందరం నడుస్తున్నాడు.

తాను కొన్న కదంబాలు తాజాగా, అందంగా వున్నాయి. అత్తయ్య వాటిని సుశీలచేతిలోపెట్టి 'మీ బావ కొనిచ్చాడే' అంటుంది. సుశీల వాటిని ప్రేమగా తలలో పెట్టుకుంటుంది. పిరుదుల్ని తాకే ఆ పొడుగాటి నల్లని జడలో కదంబాల చెండు—నాగేంద్రుడి తల మీది మణిలాగా ప్రకాశిస్తుంది ... తలచుకున్నప్పుడల్లా ఆమెను చూపించే మాయాదర్పణం ఒకటి తనకు వుంటే ఎంత బాగుంటుంది!

సుందరం బడిలోపల అడుగుపెట్టాడు:

హెడ్మాస్టరు గదిలో - మేజామీదికి కొదిగా వంగి, టీచర్ల అటెండెన్సు రిజిస్టరులో సంతకం పెడుతున్న పంతులమ్మను చూస్తూ అలాగే నిలబడిపోయాడు.

సవరం పెటి అలుకొన్న పొడుగాటి జడ పిరుదులమీద నరిశీర్షంది. నల్లని సిగలో కదంబాలు నవ్వుతున్నాయి. ప్రపంచంలో-పువులన్నీ ఒకేచోట పూయవు. అందం కూడా పువ్వులాంటిదే! తాను మాయాదర్పణంలో చూడదలచుకొన్న అందానికి ప్రతిబింబంలా వుంది ఈ అందం!

ఆమె రిజిస్టరులో సంతకంచేసి, పక్కకు తిరిగింది. సుందరం తన సిగలోకి తదేకంగా చూస్తున్నాడు. పంతులమ్మ సిగ్గుపడింది.

'ఏం సార్ ?' అంది, నవ్వుతూ.

సుందరం ఉలికిపడి 'అబ్బే-ఏంలేదండీ' అంటూ తొట్రుపడ్డాడు.

## 4

సూర్యుడు పడమటి కొండమీదికి వాలేవేళ-తూర్పు వైపు వెళ్ళిరావడం సుందరానికి అలవాటు.

తూర్పు దిక్కున ఏముంది ?

అతడు ఆరాధించే సౌందర్యమంతా వుంది.

ఆ వూరికి తూర్పు దిశలో కనిపించే ప్రకృతి సౌందర్యానికి అతని హృదయం పులకించి పోతుంది.

పచ్చని పైర్లు, కొండలు, కాలిబాటలు, చెరువులు, కుంటలు తోటలు, చెట్లు, పొదరిండ్లు, పచ్చికబీళ్ళు, పచ్చికమేసి తిరిగివచ్చే ఆలమందలు, అలసిపోయిన అందంతో యింటి ముఖం పట్టే పక్షి పడుచులు... ఈ సౌందర్యానికి కంచెవేసినట్లు సుదూరాలలో దిక్చక్రం చుట్టూ ఎత్తైన నీలికొండలు, బిడ్డ ముఖం మీదికి ప్రేమగా వొంగిచూచే కన్న తల్లి కళ్ళలాగా—ఆ ప్రకృతిమీద విశాలంగా పరచుకొన్న నీలాకాశం—ఇవన్నీ సుందరానికి సహవాసినులు!

తక్కిన మూడువైపులు అంత అందంగా వుండవు. ఉత్తరాన విశాలమైన రైల్వే క్వార్టర్సు, బొగ్గుల మిట్టలు, బూడిదల రాసులు, పడమటి దిక్కున పొడుగ్గా, పాము మెడలాంటి సన్నటి రోడ్డు. ఆరోడ్డులోనుంచి వెళ్ళి, ఊరి పొలిమేరలు దాటుకోవాలంటే చాలాసేపు పడుతుంది. ఆరోడ్డులో ఎదురుగా బస్సువస్తే పక్కకు తప్పుకోవడం కష్టం. ఊరు దాటుకున్న తర్వాత కూడా అంతే! సన్నగా రోడ్డు. అటూయిటూ పచ్చగా చెరకు తోటలు, పైన ఆకాశం. ఇంకేమీ కనిపించదు రోడు లో నడవడం విసుగెత్తిపోతే, చెరకుతోటలోకి దూరడం తప్ప గత్యంతరం లేదు. దక్షిణ దిక్కున నటి చవిటి పర్రలు, తాటాకు పాకలు. అక్కడ కల్లు దుకాణాలున్నాయి. సారాకొట్లున్నాయి. గోమాంస విక్రయశాలలున్నాయి. మురుగుగుంటలున్నాయి. వాటిని దాటుకుంటే—కంపోస్టు ఎరువుల గుంతలు, పాకీవాళ్ళ లాగుడుబండ్లు వుంటాయి, వాటిని అధిగమిస్తే వల కాడు. రక్తమాంసాలన్నీ ఊళ్ళో ధారపోసి, వల్లకాటిలో విశ్రాంతి తీసుకుంటున్న ఎముకలు! ఆ ఎముకలే నేలమీద మొలిచి పెరిగినట్లు ఎండిన మోడులు; ఆ మోడులమీద—పరకాయ ప్రవేశంచేసిన మనుషులా కూర్చున్న రాబందులు!

ఇలాంటి జుగుప్సాకరమూ, వికారమూ అయిన దృశ్యాలు ఆ వూరి తూరుపు వైపున కనిపించవు. అక్కడంతా పచ్చదనమే! చెట్లను ప్రేమించి పూజించే మనస్తత్వం ఎక్కడుందో—అక్కడే అందం వుంటుంది.

రోజూ అవైపు షికారువెళ్ళి, మునిమాపువేళ యింటికి తిరిగి రావడం సుందరానికి అలవాటైపోయింది.

ప్రకృతితో అతనికి మానసికంగా బాల్యంనుంచీ సాన్నిహిత్యం వుంది. తాను బొమ్మలువేసే తొలిరోజుల్లో అతడు ప్రకృతి దృశ్యాలే చిత్రించేవాడు. ఏరు, ఏటిగట్టున కొబ్బరిచెట్లు—జలపాతం. జలపాతం మీదుగా గంతులువేసే పిట్టలజంట—కొండ. కొండదిగువ పచ్చిక మైదానం—విశాలమైన ప్రదేశంలో కుటీరం. కుటీరంచుట్టూ పచ్చని చెట్లు-సెలయేరు, సెలయేటి గట్టున ఎగిరే కొంగ...ఇలా ఎన్నో బొమ్మలు వేశాడు. ప్రకృతిని ప్రేమించడం అతనికి ఆనందదాయకం!

ఆ ఆనందానికి ప్రస్తుతం అంతరాయం వాటిల్లింది.

ఊరికి తూర్పుఅంచున కత్తులవీధి వుంది.

వీధిమధ్యలో గౌరి వాళ్ళున్నారు. వీధికి ఒక చివర మెయిన్ రోడ్డుప్రక్కన నాగరాజా హోటలుంది. మరో చివర సుందరం వాహ్యాళికి వెళ్ళవలసిన కాలిబాట పోతుంది.

ఆ పరిసరాలోకి వెళ్ళడానికే భయం వేస్తూ వుందతనికి

అందుకే, మూడు సాయంకాలాలు మూడు వైపులకు వెళ్ళి వచ్చాడతను. ఆ మూడు రోజుల్లో మా నాగరాజా తనకు తారసిల్లలేదు

గౌరమ్మాత్రం కొళాయిలోంచి నీళ్ళు పట్టుకుపోతూ వుంది.

తాను రెండు మూడుసార్లు ఆమె కళ్ళలోకి చూడడం జరిగి చూపులు తించుకున్నాడు.

అతని భయానుమానాలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి.

"నేననుకున్నంత దుర్మార్గుడు కాడు నాగరాజు! మంచివాడే! పెద్దమనిషే! అలా నోరుచించుకుని ఇతరులమీదికి కయ్యాలకు వెళ్ళి నందుకు గౌరినే మందలించి వుంటాడు. అందుకే రెండు మూడు రోజులుగా ఆ పిల్ల గాజుల చప్పుడు తప్పితే, గొంతుకూడా వినిపించడంలేదు! అనుమానం జబ్బులా పట్టుకుంటూవుంది నన్ను. అనవసరంగా మనసు పాడుజేసుకుంటున్నాను. ఇకమీదట ధైర్యంగా వుండాలి. ఎవరూ ఏమీ చేయరని నమ్మకం కుదిరిందికదా? ఇక ధైర్యాన్ని వహించాలి!, అనుకున్నాడు.

ఆరోజు సాయంకాలం ఆవైపే షికారువెళ్ళి రావాలనుకున్నాడు. వీధిలోకి వచ్చాడు. మెయిన్‌రోడ్డులోనుండి-ప్రక్కనున్న కొబ్బరితోట లోని కాలిబాటలోకి దిగుతూవుంటే-బిందెలు చేతబట్టుకుని రోడ్డు మీద ఎదురుగా వస్తూన్న గౌరి కనిపించింది. ఆమె అతన్ని చూచింది.

అతడు కొబ్బరితోట దాటుకున్నాడు. కత్తులవీధి కొసలో వున్న చింతతోపు దాటుకున్నాడు. రెండు ఫర్లాంగులదూరం నడిచాడు.

ఎండ బాగా చల్లబడింది. చెట్లలోనుండి చల్లని గాలి వీస్తోంది. వీరెండలో పొలాలు పచ్చగా మెరుస్తున్నాయి. సుందరం ఓ రాతిగుండుమీద కూర్చున్నాడు.

గౌరి తనను చూచింది. ఈవైపు రావడం ఆమె గమనించి వుంటుంది. ఆమె ఏ గొడవా తెచ్చిపెట్టదుకదా? తన బలగంతో—ఒంటరిగా చిక్కిన తనను అటకాయించరుకదా?

తనను వెతుక్కుంటూ ఆ వీధి కుర్రాళ్ళెవరైనా యిటు వస్తారేమో? దెబ్బలాడటం తనకు చేతకాదు...ఈవైపు రాకుండా వుంటేనే బాగుండేది.

సుందరం అనుమానంగా చుట్టూ చూశాడు. ఎవరూ కని పించలేదు, అయినా తాను మెలకువగా వుండడం మంచిది కదా?

ఆత్మరక్షణార్థం ఏదైనా ఆయుధం దగ్గరుంటే మంచిది. కొంతమందిచేతిలో కర్రలు పట్టుకుని తిరుగుతుంటారు. బొడ్లోచాకు కూడా వుంచుకుంటారట! అలాంటివి దగ్గరుంచుకోవడం తనకు అలవాటులేదు. రూళ్ళకర్ర చేతబట్టుకుని బడికిపోవాలన్నా సిగ్గే!

పట్టుకోడానికి వాటంగా వుండే కర్రముక్క ఏదైనా యిక్కడ పడివుందా ?'

అతడు చుట్టూ చూశాడు. అలాంటి కర్రముక్క ఏదీ కని పించలేదు.

'రాళ్ళున్నాయి. రాళ్ళతో ఎదుర్కోవడం బాగుంటుందా? ఛీ! చిన్నపిల్లాడిలా అంత అమాయికంగా దెబ్బలాడటం ఏం గౌరవం?...'

'ఆ చెట్లోంచి ఓ బెత్తం విరిచి పెట్టుకుంటే? ... తీరా-నన్ను కొట్టడానికి ఎవరూ రాలేదనుకో! తరువాత ఆ బెత్తంతో ఉపయోగం ఏముంటుంది? దెబ్బలాటకు-మొదటనేనే సిద్ధపడినట్లు అవుతుంది. వొద్దు !'

'ఒకడే వస్తే నేను సమాళించుకోగలను. బహుశా-వాణ్ణి సునాయాసంగా చితగ్గొట్టేయగలనేమో !...ఎక్కువమంది వస్తేనే కష్టం! వాళ్ళచేత అవమానాల పాలు కావాలి. సినిమాలో కథానాయకుడు ఎంతబాగా పోట్లాడుతాడు ! వందమందినైనాసరే, పత్తి దంచినట్టు దంచేస్తాడు. నేనూ అలా కొట్టగలిగితే (ఆత్మరక్షణార్థం) ఎంత బాగుంటుంది !...'

...ప్రొద్దుపోయింది. ఇంకా వెలుతురుంది. చీకట్లు ముసురు కోలేదు. సుందరం త్వరగానే పైకిలేచాడు. ఇంటికి బయలుదేరాడు. అనుమానం కలిగేచోట నిమిషమైనా వుండకూడదు !

అతడు నడుస్తున్నాడు. చీకట్లు దట్టంగా ముసురుకోక పోయినా—చలిగాలి ప్రారంభమైంది.

'ఇప్పుడెవడైనా నా కెదురుగా వస్తాడేమో! నన్ను అగ్గిపెట్టె యిమ్మని అడుగుతాడు. నా దగ్గర లేదు కనుక లేదంటాను. ఎందుకు లేదురా-అంటూ వాడు నన్ను కొడతాడు. నేను తిరగబడి కొడతాను. అప్పుడు చెట్ల చాటునుంచీ నలుగురైదుగురు వస్తారు. మా వాణ్ణెందుకు కొట్టావురా—అంటూ నన్ను బంతిగా చేసి ఆడు కుంటారు. ఎక్కువ ఓట్లు సంపాదించగలిగితే అన్యాయం తప్పకుండా గెలుస్తుంది, న్యాయమూ, అన్యాయమూ ఎలక్షన్‌లో నుంచుంటున్నాయి. నలుగురు దొంగలు కలిసి, మేకను గాడిద అంటే—అది గాడిదే!...బలహీనుడు తిరగబడితే తప్పు !'

సుందరం చింతతోపులోకి వచ్చాడు.

అతని గుండె ఆగి, మళ్ళీ వేగంగా కొట్టుకుంది.

కత్తుల వీధి చివర గౌరి నిలబడి అతనివైపే చూస్తున్నది. 'ఆమె పక్కన నిలబడ్డ వాడెవడు? నాగరాజేనా?... ఇంకొక డెవడు? వాసుకదూ? వాళ్ళ వెనక యింకా చాలా మంది వున్నారే! దారి తప్పించి వెళ్ళిపోనా? అయ్యో! దగ్గరికే వచ్చేశానే! ఇప్పు డెలా?...వాళ్ళు చూస్తూ వుండగా అడ్డదారి తొక్కి తప్పించుకు పోవడం సాధ్యమా? వాళ్ళు అటకాయిస్తే?...'

ఒరేయ్! అక్కడే ఆగు!' అన్నాడు నాగరాజు.

సుందరం నోటమాటరాక ఆగిపోయాడు.

'ఇక లాభంలేదు. ఇన్నాళ్ళూ జాగ్రత్తపడి, ఇవాళ సులభంగా వీళ్ళ చేతికి దొరికిపోయాను. ఇటువంటి దురవస్థ నాకెప్పుడూ రాలేదు. ఎంత అవమానం! హే భగవాన్! నా శాంతమే నన్ను రక్షించుగాక!'

ఆ వీధి చివర ఓ నాలుగైదు యిళ్ళవారు అప్పటికే బయటకు వచ్చి అరుగులమీద నిలబడ్డారు. వాళ్ళలో మగవాళ్ళంతా సుందరం చుట్టూ నిలబడిపోయారు. వాళ్ళందరూ ఎర్రటి, నల్లటి బట్టలు ధరించారు. ఒకడు నల్లపంట్లాంమీద ఎర్రచొక్కా తొడుక్కున్నాడు. ఇంకొకడు మెడచుట్టూ నల్లటి, ఎర్రటి చారలున్న రుమాలు చుట్టుకున్నాడు. మరొకడు చొక్కా జేబులమీద నల్లటి, ఎర్రటి దారాలతో బొమ్మలు కుట్టుకున్నాడు. వేరొకడు నల్లటి, ఎర్రటి గళ్ళబనీను తొడుక్కున్నాడు.

పరువు పోకుండా వీళ్ళ పిడికిట్లోంచి బయట పడడం ఎలా?

అందరూ అతన్ని తిట్టడం మొదలుపెట్టారు. ఆ లోపల నాగరాజు భార్య, ఉంపుడుగత్తె కూడా రొప్పుతూ వచ్చేశారు.

నాగరాజు సుందరం భుజంమీద ఓ చెయ్యివేసి 'ఏంరా? అమ్మాయిని ఏమన్నావు నువ్వు?' అన్నాడు.

'ఏమీ అనలేదండీ!' అన్నాడు సుందరం వినయంగా.

'నాలిక కోస్తానన్నావా, లేదా?'

లేదు అనాలనిపించింది సుందరానికి. 'నాలిక కోస్తానన లేదండీ, నాలిక కాస్త లోపల పెట్టుకో అన్నాను' అని చెప్పాలని పించింది. అయితే, గౌరి అక్కడే వుంది. తన పరికితనాన్ని హేళన చెయ్యబోతున్నట్టుగా చూస్తూ వుంది. అలా అబద్ధం చెప్పడం మరీ అవమానకరం! అలా చెప్పడంకంటే దెబ్బలు తినడమే నయం!

'అన్నాను!'

సుందరం చెంప ఛెళ్ళుమంది.

'ఎన్ని గుండెలురా నీకు; అలా అనటానికి?'

సుందరం కళ్ళు గిర్రున తిరిగాయి. లోకం తనను మొట్ట మొదటిసారిగా కొట్టింది. నిండు సభలో కౌరవులు ద్రౌపదిని మాన భంగం చేసినట్టుగా—తనను నడివీధిలో నిలబెట్టి అవమానించింది.

అతనికి కోపం వచ్చింది. ఏడుపు వచ్చింది. ఇందరిలో ఏడవడం చాలా హీనం! ఏడవడంకంటే మరి నాలుగు దెబ్బలు తినడం మంచిది.

నేను మంచివాణ్ని గనుక ఆ మాటమాత్రం అన్నాను. మీ అమ్మాయి అన్నమాటలకు మరొకరైతే నాలిక కోసేవాళ్ళే! మీ అమ్మాయిని దండించుకోక నన్ను కొడతారేమండీ?

'మళ్ళీ నాలిక కోస్తానంటావుట్రా?' అంటూ వాసు తన చేతనున్న కర్రతో అతని కణతమీద ఒక్కటి వాయించాడు. నలుగురూ నాలుగు దెబ్బలు కొట్టారు. తప్పతాగి ఓ యింటి అరుగు మీద ఒంటిపై ధ్యాసలేకుండా పడివున్న తాగుబోతుకూడా కళ్ళు తెరవకుండానే 'చంపేయిరా వాణ్ణి' అంటున్నాడు.

సుందరం నోరు తెరవలేదు. మళ్ళీ ఏదైనా మాట్లాడితే తనకు శిక్ష పెరిగిపోతుంది.

ఆ సందడిలో తనకు బాగా స్నేహంవున్న ఓ గొంతు విని పించిందతనికి.

'మరి నాలుగు తనండిరా!'

ఆ గొంతు రామలింగానిది!

అందర్నీ నెట్టుకుని గుంపులోకి జొరబడ్డ రామలింగం సుందరాన్ని చూచి నివ్వెరపోయాడు.

'నువ్వట్రా సుందరం!'

రామలింగం అతని శ్రీకృష్ణ పరమాత్ముడిలా రక్షించాడు. సుందరాన్ని రెక్కపట్టుకుని దూరంగా తీసుకుపోశాడు,

ఆ వీధిలోని గుంపంతా సుందరాన్ని తిడుతూవుంది. 'రౌడీ వెధవ! నీ రౌడీతనం మా దగ్గిర వుడకదు, జాగర్త! ఎముక లేరేస్తాం!' అంటున్నారు.

చీకటి పడింది.

రామలింగం సుందరాన్ని ఓదారుస్తూ అతన్ని యింటిదాకా తీసుకొచ్చాడు. 'వాళ్ళతో ఎందుకురా గొడవ తెచ్చిపెట్టుకున్నావు? వాళ్ళు మంచివాళ్ళుకారు. అటువేపు ఎందుకొచ్చావు?... పోనీలే మనసులో ఏమీ బాధపెట్టుకోవద్దు.' అన్నాడు.

ఆ మాటల్లో సుందరానికి ఓదార్పు లభించలేదు. 'ఒరే రామలింగం! నేను కాకుండా మరొకడైవుంటే నువ్వుకూడా నాలుగు తన్నేవాడివికదూ?' అన్నాడు.

దెబ్బలు తిని వచ్చిన సుందరాన్ని చూచి రాజమ్మ కడుపు తరుక్కుపోయింది. ఆమెకు యింట్లో కాళ్ళు నిలవలేదు. 'గొర్రెపిల్ల లాంటి నిన్ను కొడతార్రటా వాళ్ళు? వాళ్ళ చేతులు పడిపోనూ!...' అంటూ యింటోనుంచి బయలుదేరింది.

'ఇప్పుడెక్కడికి వెళ్తావమ్మా? వాళ్ళదగ్గరికి పోవద్దు!' అన్నాడు సుందరం. ఆమె వినలేదు. కత్తుల వీధిలోకి వెళ్ళి, నాగరాజు యింటి ముందర నిలబడి కేకలువేసి, తాను నాలుగు మాటలని, వాళ్ళచేత పదిమాటలనిపించుకుని తిరిగివచ్చింది.

సుందరం పడుకున్నాడు. ఆమె అతనికి వేడినీళ్ళతో కాపడం పెట్టింది. 'కడుపు కట్టుకుని, ఒళ్ళు కందకుండా మల్లెపువ్వులా పెంచాను. కసాయి ముండా కొడుకులు నా బిడ్డనిలా కొట్టి పడేశారు. దేవుడు వాళ్ళ బిడ్డల్ని కొట్టడూ?' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

సుందరం కళ్ళలో నీళ్ళు తిరిగింది. అతడు కళ్ళు మూసుకున్నాడు ఇంత పెద్దవూళ్ళో అమ్మ ఒక్కతే తనకోసం ఏడుస్తోంది. తాను తిన్న దెబ్బలకంటే, తాను పడిన అవమానంకంటే—ఆ ఏడుపు ఎంతో బాధాకరంగాను, హాయిగాను వుంది. ఎంత పాపకార్యం చేశాడు తానీ రోజు! తాను దెబ్బలుతిని, అమ్మకు బాధకలిగించాడు. తాను జాగత్తగా వుండివుంటే—ఆమెకు యిప్పుడీ కష్టం కలిగేది కాదుగదా?...నాగరాజు తనను కొట్టలేదు. అమ్మను కొట్టాడు.

'నాగరాజా! మా అమ్మ చాలా మంచిది! ఆమెకంటే మంచి వాళ్ళు లోకంలో లేరు. నువ్వు మా అమ్మను కొట్టావు. నువ్వు మహాపాపివి!...ఇందుకు ప్రతిఫలంతప్పకుండా అనుభవిస్తావు! మా అమ్మ కన్నీళ్ళు నీ కొంపమీద నిప్పులై రాలిపడతాయి చూసుకో!'

ఇలా అనుకోవడం అతని మనస్సుకెంతో శాంతిని ప్రసాదించింది.

'ఒక కులం ఒక్కటై నన్ను కొట్టింది ఈరోజు. ఈ జాతులు, ఈ కులాలు నాదేశంలో పిచ్చితలలు వేస్తున్నాయి తన నాగరికతను, తన సంస్కృతిని సంరక్షించుకోవడానికి జాతీయతా భావం అవసరమేకానీ, అది యితరుల పాలిటికి దానవత్వంగా పరిణమించ కూడదు. ఈనాడు దేశంలో కులాభిమానం ప్రబలిపోతూ వుంది. పౌరులందరికీ సమాన హక్కులున్న నా ప్రజాస్వామిక దేశం కులాల పరుగు పందేనికి ఆటమైదానంగా తయారైంది. మంచికీ, చెడ్డకూ కులాభిమానం గొర్రెదాటు వేస్తూవుంది. కేవలం అభిమానంతో - ప్రతమే కులం–రేచుకుక్కల దండులా ఒక్కటవుతూవుంది కులాన్ని గుడ్డిగా ప్రేమించేవాడు, న్యాయాన్నీ, ధర్మాన్నీ అవకాశాన్నీ తనకులానికే ఆపాదించుకునేవాడు సమాజంలో ఎందుకూ? కాకులు దూరని కారడవిలా వుండాలి! అలాంటి వాళ్ళకంటే రేచుకుక్కలకు విజ్ఞత తెలుసు! తాము వుండవలసినచోటేదో వాటికి తెలుసు! అవి అడవుల్లోనే వుంటాయి...'

నాగరాజు కులంవాళ్ళందరూ తనను తలా ఒక దెబ్బ వేశారు. ముక్కూ ముఖం తెలియనివాడుకూడా తనను ముఖంమీద కొట్టాడు. వాళ్ళందరూ అలాకలిసి కొట్టడమేకాకుండా—తనకు రౌడీ అనే ముద్రవేశారు. అదే అతనికి బాధగావుంది. ఎవరు రౌడీ? ఎవరు?

నాగరాజుమీద ప్రతీకారం తీర్చుకోవాలి. పోలీసులకు రిపోర్టివ్వాలి. పోలీసుల గుండెలు కరిగిపోయేలా రిపోర్టు వ్రాయాలి.

'వాళ్ళ గుండెలు నిజంగా కరుగుతాయా? వాళ్ళద్వారా నాకు న్యాయం చేకూరుతుందా? ... ఏమో! అనుమానంగానేవుంది. పోలీసులు దేవుళ్ళలాంటి వాళ్ళు! దేవుడున్నాడు. ఎక్కడున్నాడు? పోలీసువాళ్ళున్నారు. ఎక్కడున్నారు? దేవుడు లేడా? దేవుడే లేకుంటే—ఈగాలి ఎలా వీస్తోంది? వర్షం ఎలా కురుస్తోంది? అది సైన్స్ అంటావా? పోనీ, ఈ విశ్వానికి అంతెక్కడ? చంద్రగ్రహానికి వెళ్ళటానికి మూడురోజులు పట్టింది నీకు. విశ్వపు అంచులు కనిపెట్టడానికి ఎంతకాలం పడుతుందో చెప్పు! ఇన్ని గ్రహాలు ఎలా తిరగ్గలుగుతున్నాయి? అదికూడా సైన్సనంటావా?

సరే! మనిషి ఎక్కణ్ణించి పుడుతున్నాడు? చనిన తర్వాత ఎక్కడికి వెడుతున్నాడు? అక్కడున్నాడు దేవుడు! అతడు మృత్యువులాంటివాడు! మృత్యువు అర్థం కానట్లే దేవుడుకూడా అర్థంకాడు. అతడున్నాడు!'

'...ఊళ్ళో నాలుగు బస్సులూ తిరిగే రోడ్లమీదనే ఇన్ని నాటుసారా కొట్లున్నాయి. ఇందరు త్రాగుబోతులు దేవతలా అమృతం త్రాగి, రోడ్లే నందనవనంగా విహరిస్తున్నారు. ఎక్కడున్నారు పోలీసులు?...ఏ చెట్టుక్రింద చూచినా డబ్బుపెట్టి పేకాడుతున్నారు జూదగాళ్ళు. ఆడవాళ్ళు కూడా కుతూహలం చూపేటంత బహుళ ప్రచారానికి నోచుకుంది బాకెట్ ఆట! ఎక్కడున్నారు పోలీసులు?... రెండు వర్గాలవాళ్ళు ఒకరిమీద ఒకరుపడి తన్నుకు చావడం సర్వసామాన్యమైపోయింది. ఎక్కడున్నారు పోలీసులు?...ఇటీవల ఒకటి రెండు వ్యభిచార గృహాలు కూడా అవతరించాయి ఊళ్ళో! ఎక్కడున్నారు పోలీసులు?'

'దేవుడి ఉనికిని గురించి ఎంత సులభంగా చెప్పాడు పోతన్న! ఇందుగలడందులేడని సందేహము వలదు, ఎందెందు వెదకి చూచిన అందందే గలడు—అనేశాడు. పోలీసు ఎక్కడున్నాడని అడిగితే పోతన్న ఏమంటాడు? దేవుడికి, పోలీసుకువున్న భేదం తమాషాగ లేదూ?... దేవుడు కనిపించడు. అయినా వున్నాడు! పోలీసు కనిపిస్తాడు. అయినా, లేడు!'

'కంచే చేను మేస్తూవుంది. అవినీతిని నిరోధించటానికి నియమింపబడిన ప్రభుత్వోద్యోగులే—ఆ ఉద్యోగం అనే కల్పతరువులో అవినీతిని ఫలాలుగా పండించి, తమ కామితార్థాలను నెరవేర్చుకుంటున్నారు. అవినీతి పెరుగుతున్నట్లే వారి సిరిసంపదలూ పెరుగుతున్నాయి. దొంగలు, దొరలు లాలూచీ పడుతున్నారు. డబ్బు, బలమువున్న త్రాగుబోతులు, జూదగాళ్ళు, వ్యభిచారులు, జగడాలమార్లు, దొంగలు పెద మనుషులుగా చెలామణీ ఔతూ, పంచాయితీ వెలగబెడుతూ, 'తప్పుచేశావేంట్రోయ్? అపరాధం చెల్లించూ!' అంటున్నారు. మనసా, వాచా, కర్మణా మార్గదర్శకమైవున్న సాధువులు, సాత్వికులు, మేధావులు చేతులు గట్టుకుని, తలలువాల్చి వాళ్ళముందు నిలబడుతున్నారు...'

'నీతిని రక్షించడంకోసం మేము (ప్రజలేకాదు రాజులు!) నియమించిన పోలీసూ! అవినీతిని రక్షించడ కోసం నియమింపబడ్డా ననుకుంటున్న పోలీసూ! నేను నీకు రిపోర్టివ్వను! అప్ప సమస్యలీ లాటరీ తీర్చివేస్తుందని అనుకుంటున్న రోజులివి! వివాదాన్ని పరిష్కరించటానికి నువ్వు లాటరి వేయవు అనే నమ్మకం ఏముంది? న్యాయం, అన్యాయం అని రెండు చీటీలు వ్రాసి డబ్బాలో పడేసి, నన్ను ఒక చీటీ తీసుకోమంటావు. నా కర్మకాలి అన్యాయం అనే చీటీ నాకు, న్యాయం అనే చీటీ నాగరాజుకు వస్తాయనుకో! ఎందుకొచ్చిన తంటా! సరే, అదృష్టం కొద్దీ న్యాయం అనే చీటీయే నా కొస్తుందనుకో! అలాంటి న్యాయం నా కెందుకూ? అదృష్టం నిర్ణయించి యిచ్చే న్యాయం నాకొద్దు. ధర్మం నిర్ణయించి యిచ్చే న్యాయమే నాకు కావాలి!...నీకెందుకు పాపం, లేనిపోని శ్రమ! ఉపసంహరించుకుంటున్నాను. నీకు రిపోర్టిచ్చి మాటిమాటికీ నీ దగ్గరికి తిరగడంకంటే, నా శత్రువును క్షమించి వదిలి పెట్టే యడమే ఆరోగ్యకరం!...'

సుందరానికి ఎంతో ఆనందం కలిగింది.

'పరలోకమందున్న మా తండ్రీ నీ నామము పరిశుద్ధపరచబడుగాక—నీ రాజ్యము వచ్చుగాక—నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక—మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము—మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము—మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము—ఆమేన్!'

శత్రువును క్షమించడం వలన కలిగే అనుభూతి ఎంత మధురమైనది!

సుందరానికి తానొక ఏసు క్రీస్తులాగా అనిపించింది గారి మూలంగా నాగరాజు తనకు శత్రువయ్యాడు. తనను సిలువ వేశాడు. తనను హింసించిన నాగరాజు కొరకు తాను ప్రార్థన చేస్తున్నాడు.

ఒక సమస్య తీరిపోయింది. నాగరాజు తనపైన ప్రతీకారం తీర్చుకునేశాడు. అతడు కొడతాడన్న దిగులు యిక వుండదు. నాగరాజుకు భయపడవలసిన అవసరమే యికలేదు

సుందరానికి ఆ రాత్రి హాయిగా నిద్రపట్టింది.

[ సశేషము ]